సాక్షి
నిర్మల్

గురువారం । 26 । డిసెంబర్ । 2024


క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుకుంటున్న సిస్టర్స్


జిల్లా కేంద్రంలో సీఎస్ఐ చర్చిలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి




క్రీస్తు సందేశం ఇస్తున్న పాస్టర్ జయరాజ్

నిస్సీ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు


ప్రార్థనలో యువతులు

సంబురంగా క్రిస్మస్

నిర్మల్‌టౌన్: లోక రక్షకుడు ఏసుక్రీస్తు.. జన్మదిన వేడుకలను జిల్లా వ్యాప్తంగా క్రైస్తవులు బుధవారం ఘనంగా జరుపుకున్నారు. మంగళవారం అర్ధరాత్రి నుంచే చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్రీస్తు జననాన్ని స్మరిస్తూ భక్తి పాటలు పాడారు. పాస్టర్లు, ఫాదర్‌లు, బిషప్‌లు, మత పెద్దలు క్రీస్తు జన్మ వృత్తాంతాన్ని తెలుపుతూ.. సందేశాలు ఇచ్చారు. అనంతరం కేక్‌లు కట్‌చేశారు. క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. పలు చర్చిల్లో ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. నిర్మల్ సీఎస్ఐ చర్చిలో మాజీ బిషప్ సూర్య ప్రకాశ్ వ్యాస ధ్యానం అందించారు. వెంకటాపూర్‌లోని నిస్సీ చర్చిలో ఫాదర్ జయరాజ్ సందేశాన్ని ఇచ్చారు. నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్నారు. క్రైస్తవులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యేను మత పెద్దలు ఆశీర్వదించారు.


క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుకుంటున్న యువతులు


నిస్సీ చర్చిలో ప్రార్థనలో మహిళ

న్యూస్‌రీల్

సెలవు రోజూ ఆందోళన


ఆందోళన చేస్తున్న ఉద్యోగులు

నిర్మల్ రూరల్: తమ న్యాయమైన డిమాండ్లు వెంటనే ప్రభుత్వం నెరవేర్చాలని కోరుతూ సమగ్ర శిక్ష ఉద్యోగులు చేస్తున్న దీక్ష బుధవారం 16వ రోజుకు చేరింది. క్రిస్మస్ సెలవు రోజు కూడా సమ్మె కొనసాగించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం తమను రెగ్యులర్ చేయాలన్నారు. 30% వెయిటేజీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేయాలన్నారు. చాకిరీ, శ్రమ దోపిడీ నుంచి విముక్తి కల్పించాలన్నారు. లేకపోతే సమ్మెను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. వీరికి మద్దతుగా ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా నాయకులు భీమేశ్వర్, శివశంకర్, ఓయూ జేఏసీ నాయకులు రాజారామ్ దీక్ష శిబిరానికి వచ్చి మద్దతు తెలిపారు.

కడెం నీటి విడుదలపై నేడు నిర్ణయం

కడెం: యాసంగి పంటలకు కడెం ప్రాజెక్టు నుంచి నీటి విడుదలపై గురువారం నిర్ణయం తీసుకోనున్నారు. ఈమేరకు మండల కేంద్రంలోని రైతు వేదికలో ఆయకట్టు రైతులతో మధ్యాహ్నం 12 గంటలకు సమావేశం నిర్వహించనున్నట్లు ఈఈ విఠల్ తెలిపారు. సమావేశానికి ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ హాజరవుతారని పేర్కొన్నారు. ఆయకట్టు రైతులు సకాలంలో సమావేశానికి హాజరుకావాలని కోరారు.

పునరావాస గ్రామాన్ని సందర్శించిన పీసీసీఎఫ్

కడెం: మండలంలోని రాంపూర్, మైసంపేట్ పునరావాస గ్రామాన్ని పీసీసీఎఫ్(కంపా) సునీత బుధవారం సందర్శించారు. పునరావాస ప్యాకేజీలో భాగంగా అందాల్సిన పరిహారం అందరికీ అందలేదని గ్రామస్తులు పీసీసీఎఫ్ దృష్టికి తీసుకెళ్లారు. అందరికీ అందేలా చర్యలు తీసుకుంటామని సునీత తెలిపారు. అంతకుముందు మండలంలోని లక్ష్మీపూర్ బీట్ పరిధిలో గడ్డి క్షేత్రాలను పరిశీలించారు. ఆమె వెంట ఎఫ్‌డీపీటీ శాంతారాం, డీఎఫ్‌వో నాగిని భాను, అటవీ సిబ్బంది ఉన్నారు.

సమ్మెలోనే సమగ్రం

- పక్షం రోజులుగా పాఠశాలకు రాని బోధన, బోధనేతర సిబ్బంది
- స్పందించని ప్రభుత్వం.. తగ్గేదెలే అంటున్న ఉద్యోగులు
- పూర్తికాని పది, ఇంటర్ సిలబస్
- సమీపిస్తున్న పరీక్షలు.. నష్టపోతున్న విద్యార్థులు


కేజీబీవీలో తోటి విద్యార్థులకు పాఠం బోధిస్తున్న పదో తరగతి విద్యార్థిని


నిర్మల్‌లో దీక్షలో పాల్గొన్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

లక్ష్మణచాంద: సమగ్ర శిక్ష ఉద్యోగులు సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన సమ్మె పదో తరగతి, ఇంటర్ విద్యార్థులకు శాపంగా మారింది. పక్షం రోజులుగా బోధన, బోధనేతర సిబ్బంది సమ్మె చేస్తున్నారు. దీంతో డిసెంబర్‌లో పూర్తి కావాల్సిన సిలబస్ పూర్తి కాలేదు. మరోవైపు వార్షిక పరీక్షలు సమీపిస్తున్నాయి. మార్చి మొదటి వారంలో ఇంటర్, చివరి వారంలో పదో తరగతి వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈమేరకు ప్రభుత్వం షెడ్యూల్ విడుదల చేసింది. ఈ క్రమంలో పరీక్షలకు ఎలా సన్నద్ధం కావాలో తెలియక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు కేజీబీవీలు, యూఆర్ఎస్ పాఠశాలల్లో పనిచేస్తున్నారు. వీరు డిమాండ్ల సాధన కోసం పక్షం రోజులుగా సమ్మె చేస్తున్నారు.

నిలిచిన విద్యాబోధన

సీఆర్టీలు, పీజీ సీఆర్టీలు, ఎస్‌వోలు, సమ్మె కారణంగా 16 రోజులుగా పాఠశాలలకు రావడం లేదు. దీంతో కేజీబీవీలు, యూఆర్ఎస్ పాఠశాలల్లో విద్యాబోధన నిలిచిపోయింది. విద్యార్థుల్లో ఒకరు మిగిలిన విద్యార్థులు అల్లరి చేయకుండా చూడటంతోపాటు వారికి వారే చదువుకుంటున్నారు. ఒకరిద్దరు ఉద్యోగులు వెళ్లినా తరగతులు బోధించడం లేదు. దీంతో 10వ తరగతి, ఇంటర్ విద్యార్థులు తాము నష్టపోతున్నామని పేర్కొంటున్నారు.

ఫిబ్రవరిలో ప్రయోగ పరీక్షలు..

పదో తరగతి, ఇంటర్ చదివే విద్యార్థులకు మార్చిలో వార్షిక పరీక్షలు జరుగనున్నాయి. ఇంటర్ సెకండియర్ ఎంపీసీ, బైపీసీ విద్యార్థులకు ఫిబ్రవరి 3 తేదీ నుంచి ప్రయోగ పరీక్షలు నిర్వహించాలని ఇంటర్ బోర్డు నిర్ణయించింది. గతంలో సమీపంలోని ప్రభుత్వ కళాశాలలకు విద్యార్థులను తీసుకెళ్లి ప్రయోగ పరీక్షలు చేయించేవారు. పీజీ సీఆర్టీలు సమ్మెలో ఉండడంతో ప్రయోగాలు చేయించడం లేదు. దీంతో ప్రయోగ పరీక్షలకు ఎలా హాజరు కావాలని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. ఇక పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు సాగడం లేదు. రివిజన్ తరగతులు నిర్వహించడం లేదు.

స్పందించని ప్రభుత్వం..

పక్షం రోజులుగా సమగ్ర శిక్ష ఉద్యోగులు సమ్మె చేస్తున్నా.. రాష్ట్ర ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించడం లేదు. తమ డిమాండ్లు నెరవేర్చే వరకూ సమ్మె కొనసాగిస్తామని ఉద్యోగులు పేర్కొంటున్నారు. పక్షం రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం కనీసం స్పందించకపోవడాన్ని తప్పు పడుతున్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు కూడా బోధన, బోధనేతర సిబ్బంది త్వరగా సమ్మె విరమించేలా ప్రభుత్వం చొరవ చూపాలని కోరుతున్నారు.

పూర్తికాని సిలబస్...

వార్షిక పరీక్షలు సమీపిస్తున్న సమయంలో ఒక వైపు 10వ తరగతి, మరోవైపు ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థుల సిలబస్ ఇంకా పూర్తికాలేదు. డిసెంబర్ నెలాఖరు వరకు పదో తరగతి, ఇంటర్ విద్యార్థుల సిలబస్‌లు పూర్తి చేయవలసి ఉంది. ఈనెల 10 నుంచి సిబ్బంది నిరవధిక సమ్మెలో ఉన్నారు. సమ్మె కారణంగా మిలిగిన సిలబస్ బోధించేవారు కరువయ్యారు.

ఎలా సన్నద్ధం కావాలో తెలియడం లేదు



వార్షిక పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో తమకు విద్యాబోధన చేస్తున్న పీజీ సీఆర్టీలు సమ్మెలో ఉన్నారు. దీంతో తమకు నిత్యం మార్గ నిర్దేశం చేసేవారు లేరు. ఇంటర్ ప్రయోగ పరీక్షలు, వార్షిక పరీక్షలకు ఎలా సన్నద్ధం కావాలో తెలియడం లేదు.
– వైష్ణవి, ఇంటర్ ద్వితీయ సంవత్సరం, కేజీబీవీ నర్సాపూర్

16 రోజులుగా ఖాళీగా..



కేజీబీవీ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న మాకు 16 రోజులుగా పాఠాలు చెప్పేవారు కరువయ్యారు. ఉపాధ్యాయుల సమ్మె కారణంగా పక్షం రోజులుగా ఖాళీగా ఉంటున్నాం. ఉపాధ్యాయులు సమ్మె విరమించేలా ప్రభుత్వం చొరవ చూపాలి.
– రీటా, 10 విద్యార్థి, సోన్ కేజీబీవీ

ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలి

నిర్మల్ జిల్లాలోని 19 కేజీబీవీలలో పనిచేస్తున్న ఉద్యోగులు తమ డిమాండ్ల సాధనకు 16 రోజులుగా సమ్మె చేస్తున్నారు. దీనిపై ఇదివరకే ప్రభుత్వానికి విన్నవించాం. ప్రభుత్వం త్వరగా నిర్ణయం తీసుకోవాలి. ప్రభుత్వ సూచనల మేరకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు చేపడుతాం.
– సలోమి కరుణ, కేజీబీవీ సెక్టోరియల్ అధికారి

బల్దియాలకు వార్డు ఆఫీసర్లు

- పర్యవేక్షణ కోసం నియామకం
- ఉత్తర్వులు జారీ చేసిన సర్కార్
- జిల్లాకు 39 మంది కేటాయింపు
- ఇక నేరుగా సమస్యల పరిష్కారం



నిర్మల్ మున్సిపల్ కార్యాలయం

నిర్మల్‌చైన్‌గేట్: మున్సిపాలిటీల్లో ప్రజలకు పాలన చేరువ చేసేందుకు ప్రభుత్వం వార్డు ఆఫీసర్లను నియమిస్తోంది. ఇకనుంచి ప్రజలు మున్సిపల్ కార్యాలయాలకు వెళ్లకుండానే ఇంటి నుంచే పనులు చేసుకునే అవకాశం కల్పిస్తోంది. వార్డుల్లో నెలకొన్న సమస్యలనూ పరిష్కరించుకునే సౌలభ్యం తెచ్చింది. ఒక్కో వార్డుకు ప్రభుత్వం ఒక ఆఫీసర్‌ను నియమిస్తోంది. వీరు కేటాయించిన వార్డుల్లో ప్రతీరోజు పర్యటించి సమస్యలు పరిష్కరించాలి. పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలి. జిల్లాలోని మూడు మున్సిపాలిటీలకు ప్రభుత్వం 39మంది వార్డు ఆఫీసర్లను నియమించింది.

వార్డు ఆఫీసర్ల విధులివే..

రోజువారీ పారిశుధ్య కార్యక్రమాల పర్యవేక్షణ, శానిటరీ మాస్టర్స్, కార్మికుల పనిని పర్యవేక్షించడం, డోర్ టూ డోర్ చెత్త సేకరణ, వ్యర్థాల విభజన, ప్లాస్టిక్ నిషేధం, వార్డు లెవల్ శానిటేషన్ ప్లాన్ అమలు చేయడం, మురుగుకాలువలు, పబ్లిక్ టాయిలెట్లను శుభ్రం చేయించడం, అంటువ్యాధుల నివారణ, నియంత్రణకు చర్యలు, ప్రభుత్వ, ప్రైవేట్, మార్కెట్లు, మటన్, చికెన్ స్టాల్స్ స్లాటర్‌హౌస్‌లు శుభ్రంగా ఉండేలా చూసుకోవాలి. ఘన, ద్రవ వ్యర్థాల నివారణ, వీధి దీపాలు, నీటి సరఫరా పర్యవేక్షణ చేయాలి. ఇంటి పన్నులు, హరితహారం వందశాతం చేపట్టాలి. నర్సరీలు, ప్లాంటేషన్, అవెన్యూ, ట్రీపార్కులను అభివృద్ధి పర్చాలి. సామాజిక భద్రత పథకం కింద పింఛన్లు, సంక్షేమ పథకాలు, పట్టణ పేదరికం తదితర కార్యక్రమాలు చేపట్టాలి. పలు రకాల పన్నులు, చార్జీలు, ఆస్తి పన్ను నెలవారీ జాబితాలు తయారు చేసి కార్యాలయంలో అందజేయాలి.

మూడు మున్సిపాలిటీల్లోనూ..

ప్రభుత్వం నిర్మల్ మున్సిపాలిటీకి 35 మంది, భైంసాకు ఇద్దరు, ఖానాపూర్ మున్సిపాలిటీకి ఇద్దరిని వార్డు ఆఫీసర్లుగా కేటాయించినట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు. నిర్మల్, భైంసా, ఖానాపూర్ మున్సిపాలిటీలకు కొత్తగా జూనియర్ అకౌంటెంట్ ఆఫీసర్లను నియమించారు. దీంతో అకౌంటింగ్ పూర్తిస్థాయిలో కొనసాగే అవకాశముంది. గతంలో కాంట్రాక్ట్ ఉద్యోగులు అకౌంట్స్ విభాగాన్ని చూసేవారు. ప్రస్తుతం అకౌంట్స్ విభాగం కొత్త వారిని నియమించడంతో మున్సిపాలిటీలు గాడిలో పడనున్నాయి.

ఆఫీసర్లుగా గ్రూప్–4 ఉద్యోగులు

గత ప్రభుత్వ హయాంలోనే వార్డు ఆఫీసర్ల నియామకం చేపట్టాల్సి ఉంది. కానీ, అప్పటి ప్రభుత్వం అమలు చేయలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం 35 మంది గ్రూప్–4 ఉద్యోగులను నిర్మల్ మున్సిపాలిటీకి వార్డు ఆఫీసర్లుగా కేటాయించింది. ఇందులో 15 మంది విధుల్లో చేరగా, మిగతావారు చేరాల్సి ఉంది. ఇతర మున్సిపాలిటీలకు కేటాయించిన వారిలో కొందరు విధుల్లో చేరగా మిగతావారు త్వరలో చేరనున్నారు. దాదాపు అన్ని మున్సిపాలిటీలకు త్వరలో గ్రూప్–4 ఉద్యోగులే వార్డు ఆఫీసర్లుగా రానున్నట్లు అధికారులు తెలిపారు.

మెరుగైన సేవలందించేందుకే..

వార్డు ఆఫీసర్ల నియామకంతో వార్డుల్లోని ప్రజలకు మెరుగైన సేవలు అందే అవకాశముంది. చిన్నచిన్న సమస్యల పరిష్కారం కోసంప్రజలు మున్సిపల్ కార్యాలయానికి వెళ్లకుండానే రోజూ ఉదయం నుంచి సాయంత్రం వరకు వార్డుల్లోనే అందుబాటులో ఉండే వార్డు ఆఫీసర్లకు తెలిపి పరిష్కరించుకునే అవకాశం ఏర్పడింది. వార్డులో ఏ అక్రమ నిర్మాణం జరిగినా వార్డు ఆఫీసర్లకు వెంటనే తెలియనుంది. ఆస్తి పన్ను, నల్లా పన్ను బకాయిలు పేరుకుపోయే అవకాశం అసలే ఉండదు. ఇందుకు సంబంధించి ప్రభుత్వం నుంచి త్వరలోనే సర్క్యులర్ విడుదల కానుందని అధికారులు తెలిపారు.

15 మంది రిపోర్టు చేశారు



నిర్మల్ మున్సిపాలిటీకి 35మంది మంది గ్రూప్–4 ఉద్యోగులను వార్డు ఆఫీసర్లుగా నియమించింది. ఇప్పటికే 15 మంది కార్యాలయంలో రిపోర్ట్ చేశారు. ఇకనుంచి వార్డు ఆఫీసర్లే వార్డుల్లో పన్నుల వసూలు చేస్తారు.
– ఖమర్ అహ్మద్, మున్సిపల్ కమిషనర్

సాగునీటిని సద్వినియోగం చేసుకోవాలి

- ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి


నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

సోన్: ఎస్సారెస్పీ ఆయకట్టు రైతులు సరస్వతీ కాలువ ద్వారా యాసంగి పంటలకు వచ్చే నీటిని సద్వినియోగం చేసుకోవాలని నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. సోన్ మండలం గాంధీనగర్ శ్రీరామ్‌సాగర్ ప్రాజెక్టు జలాశయం నుంచి సరస్వతి కాలువ ద్వారా ఆయకట్టుకు సాగునీటిని బుధవారం విడుదల చేశారు. అంతకుముందు గంగామాతకు పూజలు చేశారు. సరస్వతీ కాలువ ద్వారా 5 టీఎంసీలు విడుదల చేయనున్నట్లు తెలిపారు. మండల కేంద్రంలో దళితుల శ్మశానవాటికకు, రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని గ్రామస్తులు మహేశ్వర్‌రెడ్డిని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే రూ.5 లక్షలు మంజూరు చేశారు. మార గంగారెడ్డి, సరికెల గంగన్న, హరీశ్ రెడ్డి, రాజేశ్వర్, అశోక్, మహిపాల్‌రెడ్డి, రమేశ్‌రెడ్డి, నర్సారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధికి కృషి

లక్ష్మణచాంద: మండల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఐటీడీఏ నిధులు రూ.2.25 కోట్లతో వద్యాల్ నుంచి వద్యాల్ తండా వరకు చేపట్టే బీటీ రోడ్డు పనులను బుధవారం ప్రారంభించారు. గ్రామంలోని దళితులు తమ సంఘ భవనానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. ఆరోగ్య ఉప కేంద్రం బ్యాలెన్స్ పనులకు నిధులు ఇవ్వాలని వీడీసీ సభ్యులు విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యే ఎస్సీ కమ్యూనిటీ భవన నిర్మాణానికి రూ.5 లక్షలు, ఆరోగ్య ఉపకేంద్రం పనులకు రూ.5 లక్షలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. సరస్వతి కాలువపై వంతెన నిర్మించేలా చూడాలని కోరగా ఇరిగేషన్ ఈఈతో ఫోన్‌లో మాట్లాడారు. గ్రామంలోని రేణుక ఎల్లమ్మ ఆలయం నిర్మాణానికి త్వరలోనే నిధులు మంజూరు చేయిస్తానని గౌడ సంఘం సభ్యులకు హామీ ఇచ్చారు. మండలంలోని అన్ని గ్రామాల అభివృద్ధికి తనవంతుగా కృషి చేస్తానని ఆయన తెలిపారు. బీజేపీ మండల నాయకులు సరికెల గంగన్న, అడ్వాల రమేశ్, భూపాల్‌రెడ్డి, రామ్‌రెడ్డి, గోవర్ధన్, లక్ష్మణ్, వేణుగౌడ్, రమణగౌడ్, జీవన్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

వాజ్‌పేయి ఆశయాలు కొనసాగిద్దాం

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు అంజుకుమార్‌రెడ్డి


వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: ప్రతీ బీజేపీ కార్యకర్త వాజ్‌పేయి ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు అంజుకుమార్‌రెడ్డి అన్నారు. భారతరత్న, మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి శతజయంతిని పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. వాజ్‌పేయి జీవిత చరిత్రను తెలిపే ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. బీసీ మోర్చా ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పెద్దపెల్లి జిల్లా సంస్థాగత ఎలక్షన్ రిటర్నింగ్ అధికారి అయ్యన్నగారి భూమయ్య, జిల్లా మాజీ అధ్యక్షుడు రావుల రాంనాథ్, జిల్లా ప్రధాన కార్యదర్శులు సామ రాజేశ్వర్‌రెడ్డి, మెడిసెమ్మె రాజు, సీనియర్ నాయకులు ఆడపు సుధాకర్, అయ్యన్నగారి రాజేందర్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు ఓడిసెల అర్జున్, నాయకులు దశరథ్ పోశెట్టి, రచ్చ మల్లేశ్, బట్టు లింబాద్రి, సంతోష్‌రాజ్, సుంకరి సాయి, అయ్యన్నగారి రాము పాల్గొన్నారు.

క్లుప్తంగా

ద్విచక్ర వాహనం చోరీ

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని తిర్పెల్లికి చెందిన పబ్బ అనురాధ ద్విచక్ర వాహనం ఈనెల 23న చోరీకి గురైంది. రోజులాగే రాత్రి వాహనాన్ని తన ఇంటి ముందు పార్కింగ్ చేశారు. మరుసటిరోజు చూసేసరికి వాహనం కనిపించకుండా పోయింది. దీంతో చుట్టుపక్కలా గాలించినా వాహనం ఆచూకీ లభించలేదు. దీంతో బుధవారం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సునీల్‌కుమార్ తెలిపారు.

చెక్‌డ్యాంలో పడి ఒకరి మృతి


భోజారాం పటేల్ మృతదేహం

కుంటాల: మండలంలోని కల్లూరు వాగు చెక్ డ్యాం వద్దకు కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లిన జాదవ్ భోజారాం పటేల్ ప్రమాదవశాత్తు అందులో జారిపడి మృతి చెందాడు. ఎస్సై సీహెచ్ భాస్కరాచారి తెలిపిన వివరాల ప్రకారం.. భైంసా పట్టణంలోని నరసింహనగర్‌కు చెందిన జాదవ్ భోజారాం పటేల్ (53) ఏడాదిగా మద్యానికి బానిసై ఇంట్లో గొడవల కారణంగా మండలంలోని కల్లూరు గ్రామంలో కూలీ చేసుకుని జీవనం కొనసాగిస్తున్నాడు. బుధవారం ఉదయం కాలకృత్యాలు తీర్చుకునేందుకు కల్లూరు వంతెన వద్ద ఉన్న చెక్‌డ్యాం వద్దకు వెళ్లి ఒడ్డున దుస్తులు విడిచి నీటిలోకి దిగాడు. ప్రమాదవశాత్తు జారిపడి ఈత రాక నీట మునిగి మృతి చెందాడు. సమాచారం అందుకున్న స్థానికులు గాలింపు చర్యలు చేపట్టగా భోజారాం పటేల్ మృతదేహం లభ్యమైంది. మృతుడికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. మృతుడి కుమారుడు జాదవ్ ముఖేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

భర్త వేధింపులకు భార్య ఆత్మహత్య


మౌనిక మృతదేహం

ఆసిఫాబాద్‌రూరల్: ఓ వివాహిత ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సీఐ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గొల్లగూడ గ్రామానికి చెందిన గజ్జల మౌనిక (26)ను భర్త లచ్చన్న, అత్తామామ అదనపు కట్నం కోసం తరచూ వేధించేవారు. వేధింపులు తాళలేక మౌనిక బుధవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో దూలానికి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆమె తండ్రి రాజమల్లు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. కాగా, మౌనిక-లచ్చన్న దంపతులకు ఇద్దరు పిల్లలున్నారు.

దివ్యాంగులకు భరోసా ఏది?

- మూతబడిన భవిత కేంద్రాలు
- నిలిచిపోయిన ఫిజియోథెరపీ
- ఇబ్బంది పడుతున్న విద్యార్థులు



మంచిర్యాలలో తాళం వేసి ఉన్న భవిత కేంద్రం

మంచిర్యాలఅర్బన్: జిల్లాలోని ప్రత్యేకావసరాల పిల్లల్లో భరోసా నింపేందుకు ఏర్పాటు చేసిన భవిత కేంద్రాలకు తాళాలు పడ్డాయి. భవిత కేంద్రంలో కొనసాగే ఫిజియోథెరపీ సేవలు నిలిచిపోయాయి. తమ సమస్యల పరిష్కారం కోసం 14రోజులుగా సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు సమ్మెబాట పట్టిన విషయం తెలిసిందే. వారంలో ఒకరోజు ఫిజియోథెరపిస్ట్ వచ్చి లోపమున్న విద్యార్థులకు చికిత్స చేస్తారు. దివ్యాంగ పిల్లలు లోపాన్ని అధిగమించకపోయినా కనీసం లోపం శాతమైనా పెరగకుండా అందించే ఫిజియోథెరపీ చికిత్స అందుబాటులో లేకుండా పోతుండగా వారు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం సర్వ శిక్షా అభియాన్ ద్వారా 2004లో ప్రతీ మండలంలో భవిత కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. ప్రతీ కేంద్రంలో ఇద్దరు ఐఆర్‌ఈపీ, ఆయా విధులు నిర్వహిస్తున్నారు. వారానికోసారి ఫిజియోథెరపిస్ట్ వచ్చి దివ్యాంగుల్లోని వివిధ రుగ్మతలను తొలగించటానికి అధునాతన పరికరాలతో చికిత్స అందిస్తున్నారు. జిల్లాల పునర్విభజన తర్వాత 18 మండలాల్లో 36 మంది పనిచేయాల్సి ఉండగా 25 మంది మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు.

నిలిచిన బోధన పరికరాల విద్య

జిల్లాలోని భవిత కేంద్రాలపై సమ్మె ప్రభావం పడుతోంది. సమగ్ర శిక్షా అభియాన్‌లో విధులు నిర్వహిస్తున్న ఐఈఆర్పీలు విధులకు గైర్హాజరవుతుండటంతో కేంద్రాల తాళాలు తెరుచుకోవటం లేదు. 18 భవిత కేంద్రాల్లో 1,625 మంది ప్రత్యేకావసరాల మానసిక దివ్యాంగులు, చెవిటి, మూగ, అంధత్వం ఇలా 21 రకాల వైకల్యమున్నవారిని గుర్తించి సేవలందిస్తారు. ఆయా కేంద్రాల్లో వీరికి విషయ పరిజ్ఞానంపై ప్రత్యేక శిక్షణ పొందిన ఉపాధ్యాయుల (ఐఈఆర్పీ)ను నియమించారు. బోధన పరికరాలతో పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పి విషయ బోధన చేసి సాధారణ పిల్లల్లా తీర్చిదిద్దుతున్నారు. అవయవాలు సరిగా పనిచేయక నడవలేని స్థితిలో ఉన్న పిల్లలకు వారంలో ఒకసారి ఫిజియోథెరపిస్ట్ ద్వారా వ్యాయామం చేయించి నడిచేలా చొరవ తీసుకుంటున్నారు. భవిత కేంద్రాల్లో ఐఈఆర్పీలు సమ్మెబాట పట్టగా.. ప్రత్యేకావసరాలు గల పిల్లలు ఇబ్బంది పడాల్సి వస్తోందని తల్లిదండ్రులు వాపోతున్నారు.

మధ్యాహ్న భోజన బిల్లులెలా?

ఎమ్మార్సీల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు విధులకు దూరంగా ఉంటుండటంతో సమస్యలు తలెత్తుతున్నాయి. యూడైస్, టీచర్ల ప్రొసీడింగ్, రాష్ట్ర, జిల్లా స్థాయి నుంచి వచ్చే రోజువారీ సమాచారం, నివేదికలందించే పనులు స్తంభించిపోయాయి. మండల విద్యావనరుల కేంద్రంలో పాఠశాల నుంచి ఒక ఉపాధ్యాయుడిని ప్రత్యేకంగా నియమించి కంప్యూటర్‌కు సంబంధించిన పనులు మినహాయిస్తే ఎస్టీవో, ఎస్ఎస్‌సీకు సంబంధించిన ఎన్ఆర్సీ, ఇన్‌వార్డ్ ప్రతులు స్వీకరించటం మినహా చేసేదేమీలేకుండా పోతోంది. మూడు నెలలకు సంబంధించిన బడ్జెట్ విడుదలైనా మధ్యాహ్న భోజన బిల్లులు తయారు చేసే ఉద్యోగులు సమ్మెకు వెళ్లటంతో చెల్లింపు మరింత ఆలస్యం కానుంది.

అసౌకర్యాల మధ్య పాలన


పంచాయతీ భవనంలో కొనసాగుతున్న చెన్నూర్ మున్సిపాల్టీ కార్యాలయం

- పంచాయతీ భవనాల్లోనే బల్దియాలు
- పక్కా భవనాలు నిర్మించేదెప్పుడో..!
- ఇబ్బందుల మధ్య సిబ్బంది విధులు

కొత్త మున్సిపాల్టీలు, జనాభా, వార్డులు

మున్సిపాల్టీ	జనాభా	వార్డులు
చెన్నూర్	23,579	18
క్యాతన్‌పల్లి	34,182	22
నస్పూర్	85,000	25
లక్సెట్టిపేట	24,543	15

చెన్నూర్: జిల్లాలో కొత్తగా ఏర్పడ్డ మున్సిపాల్టీకు పక్కా భవనాలు లేవు. వీటిలో పాలన అసౌకర్యాల మధ్య కొనసాగుతోంది. జిల్లాలో ప్రస్తుతం ఏడు మున్సిపాలిటీలుండగా మంచిర్యాల, బెల్లంపల్లి, మందమర్రిలో పక్కా భవనాలున్నాయి. 2018లో ఏర్పాటైన లక్సెట్టిపేట, నస్పూర్, క్యాతన్‌పల్లి, చెన్నూర్ మున్సిపాల్టీలు పాత పంచాయతీ భవనాల్లోనే కొనసాగుతున్నాయి. కొత్తగా ఏర్పాటైన మున్సిపాలిటీలకు ఆదాయం పెరిగింది. బల్దియాల్లో రూ.కోట్లాది నిధులతో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. అయినా, పక్కా భవన నిర్మాణాలకు మోక్షం కలగడంలేదు. అధికారులు, సిబ్బందికి తగినట్లు పాతపంచాయతీ భవనాలు లేక వారు ఇబ్బంది పడుతున్నారు. చెన్నూర్ మున్సిపాల్టీకి పాత మున్సిపల్ కార్యాలయ ఆవరణలో స్థలం ఉంది. నిధులు మంజూరైతే ఇక్కడ భవన నిర్మాణం చేపట్టే అవకాశముంది. క్యాతన్‌పల్లి మున్సిపాల్టీకి స్థలం కేటాయించలేదు. నిధులూ మంజూరు కాలేదు. నస్పూర్ మున్సిపాల్టీ పాత పంచాయతీ భవనంలోనే కొనసాగుతోంది. భవన నిర్మాణం కోసం స్థలాన్ని కేటాయించినా నిధులు మంజూరు కాలేదు. లక్సెట్టిపేట మున్సిపాలిటీకి నిధులు మంజూరు కాలేదు. కాగా, చెన్నూర్ మున్సిపల్ భవన నిర్మాణానికి ప్రతిపాదనలు పంపినట్లు కమిషనర్ మురళీకృష్ణ తెలిపారు. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాగానే నిర్మాణం ప్రారంభిస్తామని చెప్పారు.

యాసిడ్ తాగి విద్యార్థి ఆత్మహత్యాయత్నం


రిమ్స్‌లో చికిత్స పొందుతున్న విద్యార్థి

ఆదిలాబాద్‌రూరల్: మావల మండల కేంద్రంలోని ప్రైవేట్ పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న ఓ విద్యార్థి యాసిడ్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఇదివరకు ఈ విద్యార్థి పాఠశాలలోని వసతిగృహంలో ఉంటూ చదువుకున్నాడు. పదిహేను రోజులుగా ఇంటి నుంచి బస్సులో వచ్చి వెళ్తున్నాడు. మంగళవారం పాఠశాలలోని వసతిగృహంలో ఉండాలని కుటుంబీకులు సూచించగా అక్కడే ఉన్నాడు. బుధవారం ఇంటికి తీసుకెళ్లేందుకు కుటుంబీకులు రాకపోవడంతో మధ్యాహ్నం 12గంటల సమయంలో బాత్‌రూమ్‌లోకి వెళ్లి యాసిడ్ తాగాడు. ఈ విషయాన్ని గమనించిన పాఠశాల సిబ్బంది చికిత్స కోసం రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆ విద్యార్థి చికిత్స పొందుతున్నాడు. పాఠశాల యాజమాన్యంతో పాటు కుటుంబీకులు అక్కడికి చేరుకున్నారు. ఈ విషయమై పాఠశాల జోనల్ ఇన్‌చార్జి శ్రీనివాస్‌రెడ్డిని సంప్రదించగా విద్యార్థికి పాఠశాలలోని వసతిగృహంలో ఉండేందుకు ఆసక్తి ఉండకపోవడంతోనే ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు తెలిపారు. మావల ఎస్సై గౌతమ్‌ను సంప్రదించగా, ఈ విషయమై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని వివరించారు.

భార్య కాపురానికి రావడంలేదని ఆత్మహత్య


రాజ్‌కుమార్ (ఫైల్)

మంచిర్యాలక్రైం: భార్య కాపురానికి రావడం లేదని భర్త ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానిక సీఐ ప్రమోద్‌రావ్ తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని పద్మశాలీ కాలనీకి చెందిన అయిడపు ప్రభాకర్-భాగ్య దంపతుల కుమారుడు రాజ్‌కుమార్ (29) టాటా ఏస్ వాహనం నడుపుకొంటూ జీవనం సాగించేవాడు. రాజ్‌కుమార్‌కు నాలుగేళ్ల క్రితం కొటాల మండలం బాబాసాగర్‌కు చెందిన లావణ్యతో వివాహమైంది. వీరిద్దరు రాంనగర్‌లో ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్నారు. రెండేళ్ల క్రితం ఇద్దరి మధ్య మనస్పర్థలు వచ్చాయి. దీంతో లావణ్య పుట్టింటికి వెళ్లిపోయింది. పలుసార్లు రావాలని రాజ్‌కుమార్ కోరినా ఆమె నిరాకరించడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. మంగళవారం రాత్రి తను ఉంటున్న అద్దె ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం ఉదయం తన స్నేహితులు, కుటుంబ సభ్యులు పలుసార్లు ఫోన్ చేసినా స్పందించకపోవడంతో ఇంటి తలుపు పగులగొట్టి చూడగా అప్పటికే రాజ్‌కుమార్ మృతి చెందాడు. మృతుడి తల్లి భాగ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

వేధింపులు తాళలేక ఆత్మహత్య

కాగజ్‌నగర్ రూరల్: మండలంలోని నజ్రూల్‌నగర్ విలేజ్ నంబర్-5 గ్రామానికి చెందిన దియా సహాస్ (19) బుధవారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈజ్‌గాం ఎస్సై మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. విలేజ్ నంబర్-6 గ్రామానికి చెందిన దియా సహాస్‌కు విలేజ్ నంబర్-5 గ్రామానికి చెందిన రోహన్ సహాస్‌తో ఎనిమిది నెలల క్రితం వివాహమైంది. నాలుగు నెలలుగా దియా సహాస్‌కు వేధింపులు ప్రారంభమయ్యాయి. ఈక్రమంలో జీవితంపై విరక్తి చెందిన దియా సహాస్ బుధవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిందని ఎస్సై తెలిపారు. మృతురాలి తండ్రి సమీర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

చోరీ ఘటనల్లో నిందితుల అరెస్ట్

నర్సాపూర్ (జి): మండలంలోని టెంబుర్ని గ్రామ శివారులోని శ్రీచక్ర లింగేశ్వరస్వామి ఆలయంలో నవంబర్ 24వ తేదీన హుండీ నుంచి రూ.4వేలు, గర్భగుడి నుంచి 15 లీటర్ల నూనె డబ్బా చోరీ జరిగింది. చాక్‌పల్లి గ్రామంలో డిసెంబర్ 6వ తేదీన రెండు ట్రాక్టర్ల నుంచి 100 లీటర్ల డీజిల్ చోరీకి గురైంది. ఈ ఘటనలపై నర్సాపూర్ (జి) పోలీస్‌స్టేషన్‌లో కేసులు నమోదయ్యాయి. పులి ప్రదీప్, వెంకటలక్ష్మి ఈ చోరీలకు పాల్పడినట్లు నేరాన్ని అంగీకరించినట్లు ఎస్సై సాయికిరణ్ తెలిపారు. వీరిని ఈనెల 23వ తేదీన కుభీర్ శివారులో అదుపులోకి తీసుకుని విచారించగా చోరీలకు పాల్పడుతున్నట్లు తేలిందని ఎస్సై చెప్పారు.

యువతి అదృశ్యం

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని లక్ష్మీనగర్‌కు చెందిన యువతి (21) కనిపించకపోవడంతో మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు సీఐ ప్రమోద్‌రావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. సదరు యువతి ఈ నెల 24వ తేదీన రాత్రి ఇంట్లో కుటుంబ సభ్యులతోపాటు నిద్రించింది. తెల్లవారుజామున ఉదయం 4గంటలకు చూసేసరికి కనిపించలేదు. తెలిసిన వారి ఇళ్లలో వెతికినా ఆమె ఆచూకీ లభించలేదు. గతంలో ఆమెకు రామకృష్ణాపూర్‌కు చెందిన సింగతి అఖిల్‌తో కొంతకాలం ప్రేమ వ్యవహారం సాగింది. ఈ విషయంలో వీరి మధ్య గొడవలు కూడా జరిగాయి. ఈ క్రమంలో సదరు యువతి కనిపించక పోవడంతో అఖిల్‌పై అనుమానం ఉందని యువతి కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

లేగదూడను గాయపరిచింది పులి కాదు

- స్పష్టం చేసిన అటవీశాఖ అధికారులు
- కుక్కల దాడిలో గాయపడినట్లు వెల్లడి


ఘటనా ప్రాంతంలో గుర్తించిన పాదముద్రలు

తాండూర్: మండలంలోని నీలాయపల్లి ప్లాంటేషన్ సమీపంలో లేగ దూడను గాయపరిచింది పులి కాదని అటవీశాఖ అధికారులు స్పష్టం చేశారు. పులి దాడిలో లేగ దూడ గాయపడ్డట్లు వార్తలు వెలువడిన నేపథ్యంలో డిప్యూటీ రేంజ్ అధికారి తిరుపతి అటవీ సిబ్బందితో కలిసి బుధవారం ఉదయం ఘటనా స్థలంలో విచారణ చేపట్టారు. మండలంలో పులి సంచారం లేదని, కుక్కల దాడి లో లేగదూడ గాయపడిందని తెలిపారు. లేగదూడను వెంటనే పశువైద్యశాలకు తరలించి చికిత్స అందించామని పేర్కొన్నారు. గాయపడిన లేగ దూడ మాదారానికి చెందిన రాపల్లి సతీశ్‌దిగా గుర్తించారు. లేగదూడ గాయపడిన సమీపంలో కొన్ని పాదముద్రలను స్థానికులు గుర్తించారు. అవి పులి పాదముద్రలుగా అనుమానిస్తున్నా అటవీశాఖ అధికారులు ఎలాంటి నిర్ధారణకు రాలేదు. మండలంలో పులి భయం లేదని, ఎవరూ భయాందోళనకు గురికావాల్సిన అవసరం లేదని అధికారులు స్పష్టం చేశారు.

బిల్లు కోసం మృతదేహం ఇవ్వని ఆస్పత్రి యాజమాన్యం


ఆస్పత్రి ఎదుట ఆందోళన చేస్తున్న కుటుంబీకులు

మంచిర్యాలటౌన్: కాగజ్‌నగర్‌కు చెందిన కొంగ శ్రీనివాస్‌కు ఛాతిలో నొప్పి రాగా అతడి కుటుంబ సభ్యులు జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స కోసం చేర్పించారు. చికిత్స పొందుతూ శ్రీనివాస్ మృతి చెందగా, బిల్లు చెల్లించలేదని అతడి మృతదేహాన్ని ఇచ్చేందుకు ఆస్పత్రి యాజమాన్యం నిరాకరించడంతో కుటుంబసభ్యులు ఆందోళనకు దిగారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం రాత్రి శ్రీనివాస్‌కు ఛాతిలో నొప్పి రాగా అతడి కుటుంబ సభ్యులు మంచిర్యాలలోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకువచ్చారు. అతడి పరిస్థితి విషమంగా ఉందని ఆస్పత్రి యాజమాన్యం చికిత్స కోసం రూ.1.80 లక్షల ప్యాకేజీ మాట్లాడుకున్నారు. రూ.1.62 లక్షలు చెల్లించగా చికిత్స ప్రారంభించినా గంటలోపే శ్రీనివాస్ మృతి చెందాడు. మృతదేహాన్ని బుధవారం ఉదయం తీసుకెళ్లేందుకు కుటుంబీకులు సిద్ధం కాగా, ఇంకా రూ.4.50 లక్షల బిల్లు చెల్లించాలని ఆస్పత్రి నిర్వాహకులు చెప్పారు. దీంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. అనంతరం జరిగిన చర్చల్లో ఆస్పత్రి యాజమాన్యం దిగివచ్చి రూ.30వేలు చెల్లించి మృతదేహాన్ని తీసుకెళ్లాలని కోరారు. దీంతో బాధిత కుటుంబీకులు ఈ మొత్తాన్ని చెల్లించి, మృతదేహాన్ని తీసుకెళ్లడంతో వివాదం సద్దుమణిగింది.

‘ఓరియంట్’ అమ్మకాన్ని రద్దు చేసుకోవాలి


నిరసన దీక్ష విరమింపజేస్తున్న నాయకులు

కాసిపేట: మండలంలోని దేవాపూర్ ఓరియంట్ కంపెనీ ఆదానీ గ్రూప్‌నకు అమ్మకానికి పెట్టిన ఒప్పందాన్ని యాజమాన్యం వెంటనే రద్దు చేసుకోవాలని డిమాండ్ చేస్తూ బుధవారం కంపెనీ హెచ్‌ఆర్‌కు ఓరియంట్ సిమెంట్ పర్మినెంట్ వర్కర్స్ లోకల్ యూనియన్ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ రాములునాయక్ వినతిపత్రం అందించారు. ఒప్పందం రద్దు చేసుకుని బిర్లా యాజమాన్యమే యథావిధిగా నిర్వహించాలని, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని చేపట్టిన ఒక్కరోజు నిరసన దీక్షను నాయకులు నిమ్మరసం ఇచ్చి విరమింపజేశారు. ఈ సందర్భంగా రాములునాయక్ మాట్లాడుతూ.. కంపెనీ కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. లంబాడా జేఏసీ జిల్లా అధ్యక్షుడు శంకర్, నాయక్‌పోడ్ సేవాసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొమ్ముల బాపు, స్థానిక నాయకుడు రొడ్డ రమేశ్ తదితరులున్నారు.

బైక్ అదుపుతప్పి యువకుడి దుర్మరణం


దగ్డే అముల్ (ఫైల్)

భైంసాటౌన్: బైక్ అదుపుతప్పి యువకుడు కిందపడగా తల పగిలి దుర్మరణం చెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని సిద్ధార్థనగర్‌కు చెందిన దగ్డే అముల్ (25) భైంసా-నిర్మల్ జాతీయ రహదారిపై కాలనీ వైపు నుంచి పట్టణంలోకి వస్తుండగా, నిర్మల్ చౌరస్తా సమీపంలో బైక్ ఒక్కసారిగా అదుపు తప్పి కింద పడ్డాడు. దీంతో డివైడర్‌కు ఉన్న ఇనుప గ్రిల్‌కు ఢీకొని తలపగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనలో తల నుంచి మెదడు బయటకు వచ్చి రోడ్డుపై పడగా, బైక్ కొద్ది దూరం రోడ్డును రాసుకుంటూ వెళ్లింది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. అనంతరం ట్రాలీ ఆటోలో మృతదేహాన్ని పట్టణంలోని ఏరియాస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, కొడుకు ఉన్నట్లు తెలిపారు.

కారు డ్రైవర్‌పై దాడి

బెల్లంపల్లిరూరల్: డ్రైవర్‌పై ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసి కారు, నగదు, సెల్‌ఫోన్ అపహరించిన ఘటన బెల్లంపల్లి మండల శివారులోని తిరుమల హిల్స్ సమీపంలో చోటుచేసుకుంది. బెల్లంపల్లి రూరల్ సీఐ అఫ్జలొద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం.. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ పట్టణంలో ముగ్గురు వ్యక్తులు మంగళవారం సాయంత్రం అత్యవసరంగా మంచిర్యాలకు వెళ్లాలని పాముల పురుషోత్తం కారు అద్దెకు మాట్లాడుకుని బయలుదేరారు. కాగజ్‌నగర్‌లో ఆ ముగ్గురు మద్యం సేవించారు. కారు బెల్లంపల్లికి చేరుకోగానే అందులో ఓ వ్యక్తి శ్రీనిధి హోమ్స్ వద్ద దింపాలని కోరాడు. దీంతో పురుషోత్తం హనుమాన్ విగ్రహం వద్ద యూటర్న్ తీసుకుని తిరుమల హిల్స్ వద్ద తిప్పి కాగజ్‌నగర్ వైపునకు వెళ్తున్నాడు. ఇంతలో ఓ వ్యక్తి మూత్ర విసర్జన కోసం కారు ఆపాలని కోరాడు. దీంతో కారు ఆపగా ముగ్గురు వ్యక్తులు పురుషోత్తంపై బండ రాళ్లతో దాడికి పాల్పడ్డారు. దీంతో పురుషోత్తం కిందపడిపోగా చనిపోయినట్లు భావించి అతడి వద్ద ఉన్న రూ.3వేలు, సెల్‌ఫోన్ తోపాటు అదే కారు తీసుకుని పరారై కాగజ్‌నగర్ వైపు వెళ్లారు. దాడి విషయం తెలుసుకున్న పురుషోత్తం కుమారుడు ప్రవీణ్ తాళ్లగురిజాల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ప్రవీణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ అఫ్జలొద్దీన్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు

వాంకిడి: మండలంలో బుధవారం జరిగిన వివిధ రోడ్డు ప్రమాదాల్లో పలువురికి గాయాలయ్యాయి. సాయంత్రం 6.30 సమయంలో వాంకిడి వైపు నుంచి ద్విచక్ర వాహనంపై ఇద్దరు వ్యక్తులు ఆసిఫాబాద్ వైపు వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఎదురుగా ఢీకొంది. ఎన్‌హెచ్-363పై జరిగిన ఈ ప్రమాదంలో వాంకిడి మండలం సామేలా గ్రామానికి చెందిన దేవుల బాపు కాలు పూర్తిగా విరిగిపోయింది. మహారాష్ట్రలోని ఆదెగావ్‌కు చెందిన తిప్పన్న తలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను హైవే అంబులెన్స్‌లో ఆసిఫాబాద్ ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు అక్కడి నుంచి మంచిర్యాలకు తరలించారు. అలాగే వాంకిడి మండలం దుబ్బగూడ గ్రామానికి చెందిన గొత్రే పుంజు సాయంత్రం 6 గంటల సమయంలో ఆసిఫాబాద్ వైపు నుంచి ద్విచక్రవాహనంపై వాంకిడి వైపునకు వస్తుండగా సామేల గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై ఎదురుగా వస్తున్న ఎడ్ల బండిని ఢీకొన్నాడు. దీంతో అతడి కంటి పైభాగంలో గాయాలయ్యాయి. హైవే అంబులెన్స్ సహాయంతో పుంజును ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అలాగే సరాండి గ్రామానికి వెళ్లే రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడికి స్వల్ప గాయాలయ్యాయి.

స్తంభాన్ని ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలు

భైంసాటౌన్: పట్టణంలోని నిర్మల్-భైంసా జాతీయ రహదారి పక్కన విద్యుత్ స్తంభానికి ఢీకొని ఒకరు తీవ్రగాయాలపాలయ్యారు. వివరాలు.. ఏపీనగర్‌కు చెందిన చంద్రే ఉత్తమ్ బుధవారం రాత్రి కాలనీవైపు నుంచి పట్టణం వైపు వస్తుండగా బజాజ్ ఫ్యాక్టరీ వద్ద హైవే పక్కనే ఉన్న విద్యుత్ స్తంభానికి ఢీకొన్నాడు. దీంతో ముఖంపై తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108కు సమాచారమిచ్చినా అంబులెన్స్ సకాలంలో రాలేదు. దీంతో ఆ దారిన వచ్చిన ఓ కానిస్టేబుల్ వెంటనే స్పందించి ఆటోలో పట్టణంలోని ఏరియాస్పత్రికి తరలించారు.

ఆదాయ పన్ను పరిమితి పెంచాలి


సమావేశంలో మాట్లాడుతున్న సదానందంగౌడ్

బాసర: ఉద్యోగుల ఆదాయ పన్ను పరిమితిని రూ.12 లక్షలకు పెంచాలని ఆల్ ఇండియా సెకండరీ టీచర్స్ ఎడ్యుకేషన్ ఫెడరేషన్ (ఏఐఎస్టీఎఫ్) జాతీయ ప్రధాన కార్యదర్శి జీ సదానందంగౌడ్ కోరారు. బాసరలోని ఆధ్య హోటల్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాటు చేసిన తెలంగాణ కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ వ్యాప్తంగా సీపీఎస్‌ను రద్దు చేసి, పాత పెన్షన్ విధానం అమలుకు కృషి చేస్తామని చెప్పారు. దేశంలో పాఠశాల స్థాయిలో డిటెన్షన్ విధానం అమలు చేయడాన్ని వ్యతిరేకించారు. సెమిస్టర్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీసీఈ పద్ధతిలో పరీక్షలు, సిలబస్‌ను పునఃసమీక్షించాలని కోరారు. ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.పర్వత్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఉపాధ్యాయ సర్వీస్ రూల్స్ రూపొందించి ఎంఈవో, డిప్యూటీ ఈవో, డైట్ లెక్చరర్ పోస్టులకు పదోన్నతులు కల్పించాలని కోరారు. పీఆర్సీని వెంటనే అమలు చేయాలని, పెండింగ్ డీఏలను విడుదల చేయాలన్నారు. సమగ్ర శిక్షా అభియాన్, గిరిజన సంక్షేమశాఖ పరిధిలో పని చేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. సమావేశంలో జాతీయ నాయకులు పరమేశ, నాగమణి, సదయ్య, బ్రహ్మాచారి, పున్న గణేశ్, పురుషోత్తంరెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు జుట్టు గజేందర్, కరుణాకర్‌రెడ్డి, నిర్మల్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భూమన్నయాదవ్, జే లక్ష్మణ్, దయాల్ రామారావు, ముకుందరావు, నరేందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మందమర్రికి నాలుగో బెస్ట్ ఏరియా అవార్డు


ట్రోఫీని ప్రదర్శిస్తున్న జీఎం దేవేందర్

మందమర్రిరూరల్: సింగరేణి వ్యాప్తంగా నిర్వహించిన స్పెషల్ క్యాంపెయిన్ 4.0 కార్యక్రమానికి గాను మందమర్రి ఏరియాకు నాలుగో బెస్ట్ ఏరియాగా స్థానం దక్కింది. సింగరేణి డే సందర్భంగా సోమవారం కొత్తగూడెంలోని ప్రకాశం స్టేడియంలో నిర్వహించిన కార్యక్రమంలో సీఎండీ బలరాంనాయక్, మందమర్రి ఏరియా డీవై ఎస్ఈ శ్రీధర్‌కు ట్రోఫీ అందజేశారు. బుధవారం ఏరియాలోని జీఎం చాంబర్‌లో ఏరియా జీఎం దేవేందర్ ట్రోఫీని ప్రదర్శించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ.. ఏరియాలోని అధికారులు, ఉద్యోగుల సమష్టి కృషితోనే ఏరియాకు నాలుగో బెస్ట్ స్థానం దక్కిందని పేర్కొన్నారు. సమష్టి కృషితో ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించాలని సూచించారు. కార్యక్రమంలో ఏరియా అధికారులున్నారు.

సంస్కృతి పరిరక్షణ బాధ్యత అందరిది


విద్యార్థులతో మంత్రి జూపల్లి, జనార్దన్

ఖానాపూర్: కుల, మతాలు, ప్రాంతాలకు అతీతంగా భారతదేశ ఔన్నత్యాన్ని చాటిచెప్పేలా సంస్కృతీ, సంప్రదాయాల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని అమెరికాలోని అట్లాంటా తెలుగు అసోసియేషన్ తెలంగాణ తాజా మాజీ అధ్యక్షుడు, ఖానాపూర్ వాసి పన్నెల జనార్దన్ సూచించారు. సాయి నృత్య అకాడమీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో పన్నెల జనార్దన్‌తో పాటు డాక్టర్ ప్యాడి శర్మల ఆధ్వర్యంలో బుధవారం ఈకార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి అమెరికాలోని ఓక్లాహోమా రాష్ట్రానికి చెందిన ఎనిమిది మంది విద్యార్థులు వారి తల్లిదండ్రులతో కలిసి పాల్గొన్నట్లు జనార్దన్ తెలిపారు. భారతదేశ సంస్కృతిని ముందుకు తీసుకెళ్లేందుకే ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు రుక్మిణీ రామాయణాన్ని ప్రదర్శించారు. భగవద్గీత శ్లోక పఠనంలో పాల్గొన్నారు. అనంతరం వారికి జ్ఞాపికలు అందజేశామని చెప్పారు. కార్యక్రమానికి పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తదితరులు హాజరయ్యారు.

క్లుప్తంగా

స్టడీ మెటీరియల్ అందజేత



స్టడీ మెటీరియల్ అందిస్తున్న నిర్వాహకులు

నిర్మల్‌చైన్‌గేట్: పట్టణంలోని మౌలానా ఆజాద్‌నగర్ మహ్మదీయ హైస్కూల్‌లో మైనారిటీల విద్యాఅభివృద్ధి కేంద్రం, ఉస్మానియా విశ్వవిద్యాలయం, మైనార్టీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో టెట్ ఉచిత శిక్షణ అందించారు. బుధవారం శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమం నిర్వహించగా.. 80 మంది ఉర్దూ, ఇంగ్లిష్ మీడియం అభ్యర్థులకు గ్రంథాలయ సంస్థ చైర్మన్ సయ్యద్ అర్జుమంద్ అలీ స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్కూల్ యాజమాన్యం మహ్మద్ అబ్దుల్ మతీన్, సిరాజుద్దీన్, ఖిజార్, ఎహతేషామ్ ఉద్దీన్, సయ్యద్ అజ్మత్ అలీ, సలీంఖాన్ తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' గ్రామసభ



గ్రామసభలో పాల్గొన్న అధికారులు, కూలీలు

తానూరు: మండలంలోని బోల్సాలో బుధవారం సామాజిక తనిఖీ గ్రామసభ నిర్వహించారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన ఉపాధి పనులను సామాజిక తనిఖీ బృందం అధికారులు పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. ఈసందర్భంగా పనులకు ఖర్చుచేసిన నిధుల వివరాలను సభలో గ్రామస్తులకు వివరించారు. బీఆర్‌పీ పాండు, ఈజీఎస్ ఏపీవో గంగాధర్, పంచాయతీ కార్యదర్శి వినయ్, టీఏ జితేందర్ తదితరులు పాల్గొన్నారు.

అమిత్‌షా దిష్టిబొమ్మ దహనం

ముధోల్: అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు మండలంలోని తరోడా గ్రామంలో బుధవారం దళిత సంఘాల ఆధ్వర్యంలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేశారు. దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఖేల్‌కూద్



బహుమతులు అందిస్తున్న ఉపాధ్యాయులు

భైంసాటౌన్: పట్టణంలోని కిసాన్‌గల్లి శ్రీ సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో బుధవారం జిల్లాస్థాయి ఖేల్‌కూద్ పోటీలు నిర్వహించారు. ఆయా శిశుమందిర్ పాఠశాలల విద్యార్థులకు కబడ్డీ, ఖోఖో, రన్నింగ్, లాంగ్‌జంప్, హైజంప్ తదితర క్రీడాపోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ చదువుతోపాటు ఆటల్లోనూ రాణించాలన్నారు. క్రీడలతో శారీరకంగా, మానసికంగా దృఢంగా మారుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో విభాగ్ సహ కార్యదర్శి సరికొండ దామోదర్, పాఠశాల అధ్యక్షుడు డా నగేశ్, తపస్ జిల్లా గౌరవాధ్యక్షుడు రాజేశ్వర్, ప్రధానాచార్యులు, ఆచార్యులు, 350 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన ఉధృతం

ఖానాపూర్: తమ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని మధ్యాహ్న భోజన కార్మికులు పేర్కొన్నారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టిన నిరాహార దీక్ష బుధవారం ఐదో రోజుకు చేరింది. కార్యక్రమంలో కార్మికులు లక్ష్మి, పద్మ, విజయ, నర్సవ్వ, భాను తదితరులు పాల్గొన్నారు.

ధనుర్మాస పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

మామడ: ధనుర్మాసం సందర్భంగా మండలంలోని పొన్కల్ వేంకటేశ్వరాలయంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. బుధవారం మహిళలు మంగళహారతులతో వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదం అందించారు.

పుస్తె, మెట్టెలు అందజేత

ఖానాపూర్: పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికురాలు బొమ్మెన లక్ష్మి –రాజేశ్వర్ దంపతుల కూతురు వివాహానికి ఓకేఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం పుస్తె,మెట్టెలు అందజేశారు. ఓకేఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఒ డ్డెపల్లి అనుజ–కృష్ణంరాజు దంపతులు యువతి నివాసానికి వెళ్లి పసుపు, కుంకుమ, పుస్తె,మెట్టెలు అందించారు.



సోన్ : బేతేలు ప్రార్థన మందిరంలో ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డికి కేక్ తినిపిస్తున్న పాస్టర్



నిర్మల్‌లో చిన్నారులతో కలిసి వేడుకల్లో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్



ముధోల్‌లో వేడుకల్లో చిన్నారులు



ఖానాపూర్ సీఎస్ఐ చర్చిలో క్రైస్తవులు



లక్షణచాందలో ప్రార్థనలు చేస్తున్న భక్తులు

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

జిల్లావ్యాప్తంగా బుధవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామాలు, పట్టణాల్లోని చర్చిలను సుందరంగా అలంకరించారు. భక్తులు ప్రత్యేక ప్రార్థనలు, గీతాలాపనలు చేశారు. ఈసందర్భంగా ఫాదర్లు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రేమ, దయతో నిస్వార్థంగా ఏసుక్రీస్తు మార్గం అనుసరిస్తూ జీవించాలని సూచించారు. చర్చిల వద్ద ఒకరికొకరు పండుగ శుభాకాంక్షలు చెప్పుకొని సెల్ఫీలు దిగి సందడి చేశారు. సోన్‌లోని ఐబీ వద్ద బేతేలు చర్చిని నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి సందర్శించారు. కేక్ కట్ చేసి క్రైస్తవులకు పండుగ శుభాకాంక్షలు చెప్పారు. జిల్లాకేంద్రంలోని గొల్లపేట్ ది లివింగ్ చర్చిలో మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్ పాల్గొన్నారు. భైంసాలోని ఏపీనగర్ సమీపంలోని రబ్బుని మిని స్ట్రీస్ చర్చిలో జరిగిన వేడుకలకు భైంసా ఏఎస్పీ అవినాశ్‌కుమార్.. ఖానాపూర్‌లోని సీఎస్ఐ చర్చి, సుర్జాపూర్ ఏఎంఎం చర్చిలో జరిగిన వేడుకలకు బీఆర్‌ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్ నాయక్ హాజరై ప్రార్థనలు చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



భైంసాటౌన్ : కేక్ కట్ చేస్తున్న ఏఎస్పీ అవినాష్‌కుమార్, పాస్టర్ సంతోష్



సారంగపూర్‌లో..



కుభీర్‌లో..



లోకేశ్వరం : రాయపూర్‌కాండ్లీ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు



నిర్మల్‌లోని సీఎస్ఐ చర్చిలో జనం



కుంటాల : కల్లూరులో క్రిస్మస్ వేడుకలు



నిర్మల్‌లో నిస్సీ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

వాజ్‌పేయికి ఘన నివాళి

ఖానాపూర్: పట్టణంలోని జగన్నాథ్‌రావు చౌరస్తాలో ఉన్న తెలంగాణ తల్లి విగ్రహం వద్ద మాజీ ప్రధాని వాజ్‌పేయి శత జయంతి నిర్వహించారు. అంతకు ముందు మండలంలోని మస్కాపూర్, రాజూరా తదితర గ్రామాల్లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో అంకం మహేందర్, నాయిని సంతోష్, ఆకుల రవి, ఉపేందర్, అనిల్‌రావు, సురేశ్, రాజేశ్వర్, శ్రావణ్, రమేశ్, వెంకటేశ్, గోపాల్‌రెడ్డి, రవి, సందీప్, జీవన్, వెంకటాద్రి తదితరులు పాల్గొన్నారు.

కడెం: మండలంలోని ధర్మాజీపేట్‌లో బుధవారం మాజీ ప్రధాని అటల్ బిహారి వాజ్‌పేయి జయంతి నిర్వహించారు. బీజేపీ మండలాధ్యక్షుడు కాశవేణి శ్రీనివాస్ ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. సత్తన్న, ముల్కి కృష్ణ, భీమన్న, తిరుమల్, ప్రవీణ్, నల్గొండ తదితరులున్నారు.

బాసర: మండల కేంద్రంలో బీజేపీ నాయకులు మాజీ ప్రధాని వాజ్‌పేయి చిత్రపటానికి నివాళులర్పించారు. బీజేపీ నాయకులు సతీశ్వర్ రావు, మాజీ జెడ్పీటీసీ పోగుల రాజేశ్వర్, కొండూరి ప్రతాప్‌రావు, దేవునే శంకర్‌రావు, సాయినాథ్, శ్రీనివాస్ యాదవ్ తదితరులున్నారు.

తానూరు: మండల కేంద్రంలో బీజేపీ వాజ్‌పేయి శతజయంతి నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రవిపాండే, తాలూక అధ్యక్షుడు సాయినాథ్, మండలాధ్యక్షుడు యాతలం చిన్నారెడ్డి, శివాజీ పటేల్, లక్ష్మణ్‌రెడ్డి, దేవిదాస్‌పటేల్, మారుతి, ఎల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

భైంసాటౌన్: పట్టణంలోని ఎస్ఎస్ కాటన్‌లో మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి జయంతి నిర్వహించారు. దారాబ్జి ఫ్యాక్టరీలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.మోహన్‌రావు పటేల్ వాజ్‌పేయి చిత్రపటానికి నివాళులర్పించారు. సంతోష్‌మాత నగర్‌లో జరిగిన వేడుకలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు తాలోడ్ శ్రీనివాస్, బాలాజీ పాల్గొన్నారు.



భైంసాలో నివాళులర్పిస్తున్న ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్, బీజేపీ నాయకులు



కడెం : జయంతిలో పాల్గొన్న బీజేపీ నాయకులు



తానూరులో..



ఖానాపూర్ : వేడుకల్లో పాల్గొన్న నాయకులు

ప్రతీ గ్రామానికి రోడ్డు నిర్మిస్తాం

• నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి

మామడ: రవాణా సౌకర్యం మెరుగుపర్చేందుకు ప్రతీ గ్రామానికి బీటీ రోడ్డు నిర్మించేలా కృషి చేస్తానని నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని పోతారం గ్రామం నుంచి లక్ష్మణచాంద మండలంలోని తిర్పెల్లి గ్రామం వరకు నిర్మించే బీటీ రోడ్డు నిర్మాణానికి ఐటీడీఏ ద్వారా రూ.1.36కోట్లు మంజూరయ్యాయి. బుధవారం పోతారం గ్రామంలో రోడ్డు పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు బాపురెడ్డి, రాజారెడ్డి, మెడిసెమ్మె రాజు తదితరులు పాల్గొన్నారు.



పోతారంలో శంకుస్థాపన చేస్తున్న మహేశ్వర్‌రెడ్డి

బూత్ కమిటీల ఎన్నిక

కుంటాల: మండలంలోని వెంకూర్, లింబా(కె) గ్రామాల్లో బుధవారం బీజేపీ బూత్ కమిటీలను మండల ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె.అశోక్‌కుమార్, మండల క్రియాశీల సభ్యత్వ ఇన్‌చార్జి, ప్రధాన కార్యదర్శి సూర్యవంశీ సాయినాథ్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. లింబా(కె)లో రెండు బూత్‌ల అధ్యక్షులుగా సుంకరి మల్లేశ్, మోరేకర్ మనోహర్, కార్యదర్శులుగా ఇల్లంతుల రాజు, సావంత్ యోగేశ్వర్, వెంకూర్‌లో బూత్ అధ్యక్షుడిగా బాజీరావు పటేల్, కార్యదర్శిగా పసుల సాయినాథ్ ఏకగ్రీవంగా నియమితులయ్యారు. కార్యక్రమంలో సోషల్ మీడియా మండల ఇన్‌చార్జి దత్తుపటేల్, గజానంద్‌రావు, దినేశ్ రాజేశ్వర్, నవీన్, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.



వెంకూర్‌లో ఎన్నికైన కమిటీ సభ్యులు

రంగపేటలో..

ఖానాపూర్: మండలంలోని రంగపేట గ్రామంలో బుధవారం 185వ బూత్ కమిటీని ఎన్నుకున్నట్లు బీజేపీ నాయకులు ఉపేందర్ తెలిపారు. బూత్ అధ్యక్షుడిగా కొప్పుల పద్మయ్య, కార్యదర్శిగా మాటేటి లింగన్న, తదితరులు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముళ్లపొదలు తొలగింపు

బాసర: మండలకేంద్రం నుంచి కిర్గుల్(బి) గ్రామం వెళ్లే మార్గంలో ఐదు కి లోమీటర్ల మేర రోడ్డుకు ఇరువైపులా ముళ్లపొదలను పొక్లెయిన్ల సాయంతో తొలగించారు మాజీ ప్రజాప్రతినిధులు. ఈ రోడ్డుపైకి వచ్చిన చెట్లకొమ్మలు తొలగించేందుకు బాసర, కిర్గుల్(బి) మాజీ సర్పంచ్‌లు లక్ష్మణ్‌రావు, పెద్దకొండ్రు సుధాకర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ కరెండే ప్రభాకర్ రూ.20వేలు వెచ్చించి పనులు చేయించారు. వారి వెంట ముత్యంరెడ్డి, మల్కనయాదవ్ ఉన్నారు.



రోడ్డును శుభ్రం చేయిస్తున్న నాయకులు

హైవేపై ముప్పు



భైంసాటౌన్: పట్టణంలో 61వ నంబర్ జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన పలు కల్వర్టుల వద్ద వాహనదారులకు ప్రమాదం పొంచి ఉంది. రహదారి పొడువునా కల్వర్టుల వద్ద డ్రెయినేజీ నిర్మించకపోవడం, నిర్మించిన చోట కల్వర్టులపై స్లాబు, ప్రహరీ లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఫైర్‌స్టేషన్ సమీపంలో టీఎన్జీవోస్ కాలనీ వద్ద డ్రెయినేజీపై కల్వర్టు ప్రమాదకరంగా ఉంది. డ్రెయినేజీ నిర్మించి స్లాబు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

లక్ష్మణచాంద: మండలంలోని వడ్యాల్ వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను బుధవారం పట్టుకున్నట్లు రెవెన్యూ అధి కారులు తెలిపారు. సదరు ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించామని.. తదుపరి చర్యల నిమిత్తం తహసీల్దార్ వద్దకు పంపనున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

స్వర్ణకార సంఘం ఎన్నిక

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని విశ్వబ్రాహ్మణ సంఘం కార్యాలయంలో బుధవారం పట్టణ స్వర్ణకార సంఘం కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. పట్టణ అధ్యక్షుడిగా శ్రీరామోజు నరేశ్, సెక్రెటరీ గా అన్వేశ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి

కడెం: అభయాంజనేయ స్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. బుధవారం మండలంలోని మాసాయిపేట్ గ్రామంలో జరుగుతున్న అభయాంజనేయస్వామి ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలను ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామస్తుల వినతి మేరకు ఆలయ ప్రహరీ నిర్మాణానికి రూ.ఏడు లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈసందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ దినకర్‌రెడ్డి ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

సంక్షిప్త వార్తలు

30వరకు వాహనాల మళ్లింపు

బాసర: దక్షిణమధ్య రైల్వే పరిధిలోని నిజామాబాద్ జిల్లాలోని నవీపేట్ ప్రధాన రైల్వేగేటుకు గురువారం నుంచి ఈనెల 30వరకు (ఐదు రోజుల పాటు) మరమ్మతులు నిర్వహించనున్నట్లు రైల్వే అధికారులు ఓ ప్రకటనలో వెల్లడించారు. ఈ నేపథ్యంలో భైంసా, బాసర నుంచి నిజామాబాద్ వైపు వెళ్లే వాహనదారులు ఫకీరాబాద్, కల్యాణ్‌పూర్, సారంగాపూర్ మీదుగా ప్రయాణం సాగించాలని సూచించారు.

27న పడిపూజ

ఖానాపూర్: పట్టణంలోని అయ్యప్ప ఆలయంలో ఈనెల 27న మండల పడిపూజ నిర్వహించనున్నట్లు మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం తెలిపారు. ఈపడిపూజకు గురుస్వామి పాపారావు, పండితులు నితీశ్, విజయ్, భద్రాచలం చండీ ఉపాసకులు ప్రదీప్‌శర్మతోపాటు గణేశ్ గురుస్వామి భజన మండలివారు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

కడెం: ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఆదేశాల మేరకు మండలంలోని కొండుకూర్ గ్రామంలో బుధవారం ఐదుగురు లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ పార్టీ నాయకుడు పాద్దుటూరి సతీశ్‌రెడ్డి పంపిణీ చేశారు. మాజీ వైస్‌ఎంపీపీ సంతోశ్‌రెడ్డి, మాజీ సర్పంచ్ వేణుగోపాల్, గ్రామస్తులు రాజన్న, సురేశ్, పుల్లయ్య, గంగారాజం ఉన్నారు.

ఖానాపూర్: మండలంలోని సత్తనపల్లి, బాదనకుర్తి, గోసంపల్లె గ్రామాల్లో లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు.

జాన్సన్‌నాయక్‌కు సన్మానం

ఖానాపూర్: మందడలంలోని సుర్జాపూర్‌లో బీఆర్‌ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్య జాన్సన్ నాయక్‌ను ఆ పార్టీ గల్ఫ్ దేశం ఖతార్ అధ్యక్షుడు అబ్బగొని శ్రీధర్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా స్థానిక నాయకులతో కలిసి జాన్సన్ నాయక్‌ను సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌వీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మాజీ అధ్యక్షుడు కొప్పుల నరేశ్, బీఆర్ఎస్ ఖతార్‌శాఖ ఉపాధ్యక్షుడు దొనికెని నర్సయ్య, శనిగారపు శ్రావణ్, బూసి నరేందర్, వెంకట్రాములు తదితరులు పాల్గొన్నారు.